ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

నవంబర్ 7 శనివారం 2026 | సంపుటి : 1 | సంచిక : 29 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

SATURDAY NOVEMBER 7 2026 | VOL:1 | ISSUE: 29 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM



ప్రధాని మోదీని కలిసిన సూర్యకుమార్ యాదవ్



భార్య దేవీశా శెట్టితో కలిసి ప్రధానితో భేటీ

2026 టీ20 ప్రపంచకప్ గోల్డ్ మెడల్‌తో ప్రత్యేక ఆకర్షణ

కన్నడలో గణేశుడి భక్తి కీర్తనలు ఆలపించిన బాలిక

వీడియోను ఎక్స్ ఖాతాలో పంచుకున్న ప్రధాని

న్యూఢిల్లీ: టీమిండియా టీ20 జట్టు మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. దేశ రాజధానిలో జరిగిన ఈ భేటీలో సూర్యకుమార్ తన భార్య దేవీశా శెట్టితో కలిసి ప్రధానితో కొంతసేపు గడిపారు. ఈ సందర్భంగా 2026 టీ20 ప్రపంచకప్‌లో విజయం సాధించిన సందర్భంగా అందుకున్న గోల్డ్ మెడల్‌ను సూర్య తన మెడలో ధరించి కనిపించారు. ఈ

(మిగతా 2వ పేజీలో..)

మరో ఐదు పట్టణాలకు ఇందిరమ్మ ఇళ్లు విస్తరణ

2,400 ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి

నిజామాబాద్, వరంగల్, హన్మకొండ, నల్గొండ, మహబూబ్‌నగర్‌కు అవకాశం

ఒక్కో పట్టణంలో 480 ఫ్లాట్ల చొప్పున నిర్మాణం

ఒక్కో యూనిట్‌కు రూ.8.50 లక్షల వ్యయం

అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల సబ్సిడీ



హైదరాబాద్, నవంబరు 6 :


రాష్ట్రంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు గృహ వసతి కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇందిరమ్మ ఇళ్లు--టవర్స్ పథకాన్ని మరో ఐదు ప్రధాన పట్టణాలకు విస్తరించింది. నిజామాబాద్, వరంగల్, హన్మకొండ, నల్గొండ, మహబూబ్‌నగర్ పట్టణాల్లో అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీవో ఆర్టీ నంబర్ 579 ద్వారా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఐదు పట్టణాల్లో మొత్తం 2,400 ఫ్లాట్లు నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ఒక్కో పట్టణంలో 480 ఫ్లాట్లు

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఐదు పట్టణాల్లో ఒక్కో ప్రాంతానికి 480 ఫ్లాట్లు కేటాయించనున్నారు. మొత్తం 2,400 ఇళ్లను జీ+5 విధానంలో అపార్ట్‌మెంట్ల రూపంలో

(మిగతా 2వ పేజీలో..)

అక్రమ ఐవీఎఫ్ కేంద్రాలపై కఠిన చర్యలు



నిబంధనలు ఉల్లంఘిస్తే శాశ్వతంగా రిజిస్ట్రేషన్ల రద్దు

అక్రమ అండాల సేకరణ ముఠాలతో సంబంధాలుంటే చర్యలు

బాధ్యులైన వైద్యుల లైసెన్సుల రద్దుకు ఆదేశాలు

ఐవీఎఫ్ కేంద్రాలపై నిరంతర నిఘా, తనిఖీలు

సరోగసి, ఏఆర్‌టీ చట్టాల అమలుకు నిపుణుల కమిటీ

మందుల తయారీ నుంచి విక్రయాల వరకు డ్రగ్స్ కంట్రోల్ పర్యవేక్షణ

సంతానలేమితో బాధపడుతున్న దంపతుల అవసరాలను ఆసరాగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ ఐవీఎఫ్ కేంద్రాలపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. నిబంధనలను ఉల్లంఘిస్తూ

(మిగతా 2వ పేజీలో..)

గిరిజనుల హక్కులు, సంస్కృతికి ప్రత్యేక కమిషన్ అండగా నిలవాలి: కవిత



ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్ల ఏర్పాటును స్వాగతిస్తున్నాం

తమ పార్టీ డిమాండ్‌కు ప్రభుత్వం స్పందించిందని వెల్లడి

జల్--జంగల్--జమీన్‌పై గిరిజనుల హక్కులను కాపాడాలి

ఆదివాసీల ఆత్మగౌరవం, సంప్రదాయాలకు గుర్తింపు ఇవ్వాలి

ప్రత్యేక కమిషన్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

హైదరాబాద్: తెలంగాణలో ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్వాగతించారు. ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని తమ పార్టీ గతంలోనే డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. తమ డిమాండ్‌కు స్పందిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. ఆదివాసీలు, గిరిజనుల ఆకాంక్షలను గౌరవించేలా ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించడం అభినందనీయమని తెలిపారు.

వేర్వేరు సమస్యలకు ప్రత్యేక పరిష్కారాలు అవసరం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎస్సీ, ఎస్టీలకు కలిపి ఒకే కమిషన్ ఏర్పాటు చేయడంతో ఇరు వర్గాల సమస్యలకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని కవిత అభిప్రాయపడ్డారు. ఎస్సీలు, ఎస్టీలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు వేర్వేరుగా ఉంటాయని వివరించారు. ఎస్సీలు ఇప్పటికీ పీడన, అణచివేత, దౌర్జన్యాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఆదివాసీలను వివిధ కారణాలతో అడవుల నుంచి దూరం చేసే ప్రయత్నాలు

(మిగతా 2వ పేజీలో..)

మైనార్టీల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ: భట్టి విక్రమార్క

విద్య, సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

ఓల్డ్ సిటీ అభివృద్ధికి భారీగా నిధుల కేటాయింపు

హజ్‌హౌస్ సమీపంలో అసంపూర్తి భవనానికి రూ.25 కోట్లు

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పరిధిలోకి ఈజిప్ట్, సౌదీ అరేబియా

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలి



హైదరాబాద్, నవంబరు 6

మైనార్టీల విద్య, సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఓల్డ్ సిటీ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించామని వెల్లడించారు. షాదీ ముబారక్, ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల అమలుపై శుక్రవారం ప్రజాభవన్‌లో మంత్రి అజారుద్దీన్‌తో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనార్టీ సంక్షేమ పథకాల అమలు, విద్యా అవకాశాల విస్తరణ, పెండింగ్ పనుల పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు.

(మిగతా 2వ పేజీలో..)

కాళేశ్వరం విఫలమైనా ఎస్సారెస్పీతో సాగునీరు అందించాం: ఉత్తమ్

కేసీఆర్ హయాంలోనే కాళేశ్వరం కూలిందని వ్యాఖ్య

ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొంటాం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమ్‌రెడ్డి ఘన విజయం ఖాయం



2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్ ప్రభంజనమే

సూర్యాపేట జిల్లా, నవంబరు 6

కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతిన్నప్పటికీ ఎస్సారెస్పీ ద్వారా రైతులకు సాగునీరు అందించామని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ హయాంలోనే కూలిందని వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటామని

(మిగతా 2వ పేజీలో..)

మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుపాను దెబ్బతీసింది: రేటూరులో చంద్రబాబు

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటన


గుంటూరు జిల్లా రేటూరులో రైతులతో మాట్లాడిన సీఎం

తుపానుల నష్టాన్ని అంచనా వేస్తున్నాం, ప్రతి రైతునూ ఆదుకుంటామమని భరోసా

పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీతో నష్టపోయిన పెట్టుబడి అందిస్తామని వెల్లడి

తుపానుల వేళ గత ప్రభుత్వం రెడ్ కార్పెట్ పర్యటనలు చేసిందని విమర్శలు

నీటి భద్రత, సమర్థ నీటి నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఉద్ఘాటన



మంచి దిగుబడితో పంట చేతికొచ్చి ఆనందంగా ఉన్న సమయంలో మురసు తుపాను రైతుల ఆశలను నీరుగార్చిందని సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటను తుపాను దెబ్బతీయడం అత్యంత బాధాకరమని, నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, గుంటూరు జిల్లా రేటూరు

(మిగతా 2వ పేజీలో..)

బాలరాజు యాదవ్ అరెస్ట్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

బీఆర్ఎస్ నేత దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్ట్

అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు

రాజకీయ కక్ష సాధింపేనంటూ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్టుపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రాజకీయ విమర్శలకు

(మిగతా 2వ పేజీలో..)



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సం పా దకీయం

ప్రజా ప్రదేశాల పరిరక్షణ.. సమాజానికి సమష్టి బాధ్యత!

ఒక పట్టణం లేదా గ్రామం అభివృద్ధి చెందిందంటే అక్కడి రహదారులు, భవనాలు, వాణిజ్య సముదాయాలు మాత్రమే కాదు.. ప్రజలకు అందుబాటులో ఉన్న పార్కులు, ఆటస్థలాలు, గ్రంథాలయాలు, ఫుట్‌పాత్‌లు, బహిరంగ ప్రదేశాలు కూడా అభివృద్ధి చెందాలి. ప్రజలు స్వేచ్ఛగా నడవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి, పిల్లలు ఆటలాడుకోవడానికి, వృద్ధులు ప్రశాంతంగా గడపడానికి అవసరమైన ప్రదేశాలు ప్రతి ప్రాంతంలో ఉండాలి. కానీ పెరుగుతున్న జనాభా, నిర్మాణాల విస్తరణ, ఆక్రమణలు, నిర్వహణ లోపాల కారణంగా ప్రజా ప్రదేశాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలి.

ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి

పట్టణాల్లో ఫుట్‌పాత్‌లు, పార్కులు, ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. పాదచారులు నడవాల్సిన మార్గాల్లో దుకాణాలు, వాహనాల పార్కింగ్, ఇతర నిర్మాణాలు ఏర్పడటంతో ప్రజలు రహదారులపై నడవాల్సిన పరిస్థితి వస్తోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను ఇతర ప్రయోజనాలకు వినియోగించకుండా అధికారులు పర్యవేక్షించాలి. ఆక్రమణలు జరిగినప్పుడు రాజకీయ లేదా వ్యక్తిగత ప్రభావాలకు తావులేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ప్రజా స్థలాలను కాపాడటం అంటే భవిష్యత్తు తరాల అవసరాలను కాపాడటమే.

పార్కులు ఆరోగ్యానికి వేదికలు

రోజురోజుకూ పెరుగుతున్న పని ఒత్తిడి, వాహనాల రద్దీ, కాలుష్యం మధ్య ప్రజలకు ప్రశాంతంగా గడిపే ప్రదేశాలు అవసరం. పార్కులు, బహిరంగ ప్రాంగణాలు అందుకు ఎంతో ఉపయోగపడతాయి. ఉదయం, సాయంత్రం నడకకు వెళ్లేవారు, వ్యాయామం చేసేవారు, పిల్లలతో సమయం గడిపే కుటుంబాలకు ఇవి ఎంతో అవసరం.అయితే అనేక ప్రాంతాల్లో పార్కులు సరైన నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. మొక్కలకు నీరు అందించకపోవడం, వ్యాయామ పరికరాలు దెబ్బతినడం, చెత్త పేరుకుపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. స్థానిక సంస్థలు పార్కుల నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వాటిని పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచాలి. స్థానిక ప్రజల భాగస్వామ్యంతో నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేయవచ్చు.

పిల్లలకు ఆటస్థలాలు కల్పించాలి

ప్రస్తుత కాలంలో పిల్లలు ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల ముందు గడుపుతున్నారు. బహిరంగ ఆటలకు అవకాశం తగ్గిపోవడం వల్ల శారీరక చలనం కూడా తగ్గుతోంది. ప్రతి కాలనీ, గ్రామంలో పిల్లలు సురక్షితంగా ఆడుకునే మైదానాలు ఉండాలి.క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ వంటి ఆటలకు అవసరమైన స్థలాలను పరిరక్షించాలి. ఇప్పటికే ఉన్న ఆటస్థలాలను ఇతర అవసరాలకు మళ్లించకుండా చూడాలి. పాఠశాలలతో పాటు స్థానిక సంస్థలు కూడా క్రీడా వేదికలను అభివృద్ధి చేయాలి. చిన్న వయసు నుంచే క్రీడల్లో పాల్గొనే అవకాశాలు కల్పిస్తే పిల్లల్లో ఆరోగ్యం, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే లక్షణాలు పెరుగుతాయి.

పాదచారుల హక్కులను గుర్తించాలి

రోడ్లు వాహనాల కోసమే అన్న ఆలోచన మారాలి. పాదచారులు, సైకిల్ ప్రయాణికులు కూడా రహదారులపై సమాన హక్కు కలిగి ఉంటారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురైతే ప్రజలు వాహనాల మధ్య నడవాల్సి వస్తుంది. ఇది ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంది.రద్దీ ప్రాంతాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, మార్కెట్ల సమీపంలో సురక్షితమైన ఫుట్‌పాత్‌లు, జీబ్రా క్రాసింగ్‌లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. దివ్యాంగులు సులభంగా ప్రయాణించేందుకు అనువైన మార్గాలు ఉండాలి. పట్టణ ప్రణాళికలో పాదచారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి.

గ్రంథాలయాలు, సామాజిక వేదికలను బలోపేతం చేయాలి

ప్రజా ప్రదేశాలు అంటే పార్కులు, ఆటస్థలాలు మాత్రమే కాదు. గ్రంథాలయాలు, కమ్యూనిటీ కేంద్రాలు, సాంస్కృతిక వేదికలు కూడా సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి. యువత చదువుకునేందుకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు, వృద్ధులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇలాంటి వేదికలు అవసరం.

ప్రధాని మోదీని కలిసిన సూర్యకుమార్ యాదవ్

మొదటి పేజీ తరువాయి)

భేటీలో సూర్య దంపతులతో పాటు ఓ బాలిక కూడా పాల్గొనడం ప్రత్యేకంగా నిలిచింది.

ప్రధానికి భక్తి గీతాలు వినిపించిన బాలిక..

సూర్యకుమార్ దంపతులతో వచ్చిన బాలిక కన్నడ భాషలో గణేశుడి భక్తి కీర్తనలను ఆలపించి ప్రధాని మోదీకి వినిపించింది. బాలిక పాటలను ఆసక్తిగా విన్న ప్రధాని, ఆ సందర్భానికి సంబంధించిన వీడియోను తన అధికారిక ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ భేటీకి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

దీపావళి వేడుకలపై మోదీ సందేశం..

దీపావళి వేళ అయోధ్యలో శ్రీరాముడు, సరయూ నది దివ్యంగా వెలిగిపోయినట్లు ప్రధాని తన వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆ శుభప్రదమైన క్షణాలు దీపావళి పండుగకు మరింత శోభను తీసుకొచ్చాయని తెలిపారు. 14 ఏళ్ల వనవాసం అనంతరం శ్రీరాముడు అయోధ్యకు తిరిగి చేరుకున్న సందర్భాన్ని గుర్తుచేస్తూ, సరయూ నది తీరంలో దీపావళి వేడుకలు నిర్వహించే సంప్రదాయ ప్రాధాన్యాన్ని తన సందేశంలో వివరించారు.

బాలరాజు యాదవ్ అరెస్ట్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

పోలీసు కేసులతో బదులివ్వడం దుర్మార్గమని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ భార్య ఇందుజా రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బాలరాజు యాదవ్‌ను అరెస్టు చేశారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. కేటీఆర్, హరీశ్ రావులపై బల్మూర్ వెంకట్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బాలరాజు యాదవ్ ఇటీవల మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే ఆయనపై అట్రాసిటీ కేసు పెట్టడం రాజకీయ కక్ష సాధింపేనని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ అరెస్టుపై కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. “రాజకీయ విమర్శలకు సమాధానం రాజకీయంగానే చెప్పాలి తప్ప పోలీసు కేసులతో కాదు. అరెస్టు పేరుతో బాలరాజు యాదవ్‌ను సిటీ అంతా తిప్పుతూ ఆయన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గం. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరు” అని కేటీఆర్ పేర్కొన్నారు.బాలరాజు యాదవ్‌పై పెట్టిన కేసును తక్షణమే ఉపసంహరించుకుని, ఆయనను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును కాలరాయలేరని హితవు పలికారు. ఈ అరెస్టును బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కూడా ఖండించారు.

మరో ఐదు పట్టణాలకు ఇందిరమ్మ ఇళ్ల విస్తరణ

మొదటి పేజీ తరువాయి)

నిర్మించనున్నారు. పట్టణ ప్రాంతాల్లో నివసించే అర్హులైన పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ఈ పథకం విస్తరణ ప్రధాన ఉద్దేశంగా భావిస్తున్నారు.

రూ.204 కోట్లతో నిర్మాణాలు

ఒక్కో ఫ్లాట్ నిర్మాణానికి రూ.8.50 లక్షల చొప్పున వ్యయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లెక్కన ఐదు పట్టణాల్లో చేపట్టనున్న మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.204 కోట్లుగా అంచనా వేసింది. నిర్మాణ వ్యయంలో భాగంగా అర్హులైన ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీ కుటుంబాలకు ఒక్కో యూనిట్‌పై రూ.5 లక్షల సబ్సిడీ అందించనున్నారు. మిగిలిన మొత్తంలో లబ్ధిదారుల వాటాగా గరిష్ఠంగా రూ.3.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.

దరఖాస్తుల పరిశీలన బాధ్యత హౌసింగ్ బోర్డుకు

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. దరఖాస్తుల స్వీకరణ, అర్హతల పరిశీలన, లాటరీ విధానం ద్వారా లబ్ధిదారుల ఎంపిక వంటి ప్రక్రియలను హౌసింగ్ బోర్డు పర్యవేక్షించనుంది. మరోవైపు ఆయా పట్టణాల్లో నిర్మాణాలకు అవసరమైన స్థలాల గుర్తింపు, కేటాయింపు బాధ్యతలను జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ అధికారులకు అప్పగించింది. ఈ నిర్ణయంతో మరో ఐదు పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు మార్గం సుగమమైంది.

మైనార్టీల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ: భట్టి విక్రమార్క

మొదటి పేజీ తరువాయి)

మైనార్టీ విద్యా వసతుల బలోపేతానికి చర్యలు

నాంపల్లిలోని హజ్‌హౌస్ పక్కన అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రూ.25 కోట్లు కేటాయించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ భవనంలో మైనార్టీ స్టడీ సర్కిల్‌తో పాటు సంక్షేమ శాఖ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణ, అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు మొఘల్‌పురా, బండ్లగూడలో మరో రెండు స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

విద్యాసంస్థల బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వద్దు

మైనార్టీ విద్యాసంస్థలకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తకుండా పెండింగ్ బిల్లుల అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యారంగంలో మైనార్టీ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

విదేశీ విద్యకు మరిన్ని అవకాశాలు

మైనార్టీ విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించే లక్ష్యంతో ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం పరిధిలోకి ఈజిప్ట్, సౌదీ అరేబియాలను చేర్చినట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. దీంతో విదేశాల్లో విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడేలా పథకాలను సమర్థంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి

రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. క్రైస్తవ మైనార్టీల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. షాదీ ముబారక్ సహా మైనార్టీల సంక్షేమానికి ఉద్దేశించిన పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పథకాల అమలులో నిర్లక్ష్యం వహించకుండా, లబ్ధిదారులకు సకాలంలో ప్రయోజనాలు అందించాలని దిశానిర్దేశం చేశారు.

కాళేశ్వరం విఫలమైనా ఎస్సారెస్పీతో సాగునీరు అందించాం: ఉత్తమ్

మొదటి పేజీ తరువాయి)

ధీమా వ్యక్తం చేశారు. నాయకుల మధ్య అనవసరమైన వివాదాలు, చిన్నచిన్న పంచాయతీలు వద్దని, అందరూ సమానమేనని పేర్కొన్నారు. నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లాలో పర్యటించిన మంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొని మీడియాతో మాట్లాడారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొంటాం

వాతావరణ పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగంపై ప్రభావం పడకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సాగునీటి విషయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకుంటామని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేశారు.

నాయకులంతా ఐక్యంగా పనిచేయాలి

రాజకీయ నాయకుల మధ్య చిల్లర పంచాయతీలు, అనవసర విభేదాలకు తావివ్వకూడదని మంత్రి సూచించారు. అందరూ సమానమేనని, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఐక్యతతో ముందుకు సాగినప్పుడే పార్టీ లక్ష్యాలను సాధించగలమని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎవరెన్ని విమర్శలు చేసినా తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. 2024 నుంచి 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా సాగుతోంది

స్వతంత్ర భారత చరిత్రలో తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న రాష్ట్రాలు చాలా తక్కువగా ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు.

గిరిజనుల హక్కులు, సంస్కృతికి ప్రత్యేక కమిషన్ అండగా నిలవాలి: కవిత

మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నాయని ఆరోపించారు.

జల్--జంగల్--జమీన్‌పై హక్కులు కాపాడాలి

గిరిజనుల జీవన విధానంతో ముడిపడిన జల్--జంగల్--జమీన్‌పై వారి హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు. ఆదివాసీలు తమ భూములు, అడవులు, సహజ వనరులపై హక్కులు కోల్పోయే ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏర్పాటయ్యే ఎస్టీ కమిషన్ కేవలం ఫిర్యాదుల పరిష్కారానికే పరిమితం కాకుండా గిరిజనుల ఆకాంక్షలకు ప్రతీకగా నిలవాలని సూచించారు. వారి ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

వేర్వేరు కమిషన్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

కాగా, రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలు, హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కమిషన్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నవంబరు 5న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న 'తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చట్టం--2003'ను రద్దు చేసేందుకు ఆమోదం తెలిపింది. దాని స్థానంలో 'తెలంగాణ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చట్టం--2026', 'తెలంగాణ షెడ్యూల్డ్ తెగల కమిషన్ చట్టం--2026'లను తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ముసాయిదా ఆర్డినెన్స్‌కు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

జాతీయ స్థాయి తరహాలో రాష్ట్రంలోనూ ఏర్పాటు

జాతీయ స్థాయిలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం జాతీయ ఎస్సీ కమిషన్, ఆర్టికల్ 338ఏ ప్రకారం జాతీయ ఎస్టీ కమిషన్ వేర్వేరుగా పనిచేస్తున్నాయి. ఇదే తరహాలో తెలంగాణలోనూ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సమస్యలను ప్రత్యేకంగా పరిష్కరించేందుకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో ఇరు వర్గాల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థలు అందుబాటులోకి రానున్నాయి.

అక్రమ ఐవీఎఫ్ కేంద్రాలపై కఠిన చర్యలు

మొదటి పేజీ తరువాయి)

అక్రమ కార్యకలాపాలకు పాల్పడే కేంద్రాల రిజిస్ట్రేషన్లను శాశ్వతంగా రద్దు చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఐవీఎఫ్ సేవల పేరుతో బాధిత దంపతులను మోసం చేయడం, అక్రమాలకు పాల్పడటం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు..

అక్రమంగా అండాలను సేకరిస్తున్న ముఠాలతో సంబంధాలు కలిగి ఉన్న ఐవీఎఫ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాల్లో భాగస్వాములైన వైద్యుల లైసెన్సులను రద్దు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో వెలుగుచూసిన అక్రమాల అనంతరం మరో ముఠా కార్యకలాపాలను కూడా గుర్తించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఐవీఎఫ్ కేంద్రాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

మందుల విక్రయాలపైనా నిఘా..

ఐవీఎఫ్ చికిత్సకు ఉపయోగించే మందుల తయారీ నుంచి విక్రయాల వరకు డ్రగ్స్ కంట్రోల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. మందుల సరఫరా, వినియోగం, విక్రయాల్లో అక్రమాలకు తావులేకుండా చూడాలని సూచించారు. సంతానలేమితో బాధపడుతున్న దంపతుల బలహీనతను ఆసరాగా చేసుకుని అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడం, మోసాలకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అదే సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐవీఎఫ్ సేవలను మరింత విస్తరించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుపాను దెబ్బతీసింది: రేటూరులో చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి)

చర్యలను వారికి వివరించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, “అర్నబ్, మురసు తుపానుల వల్ల రాష్ట్రానికి, ముఖ్యంగా రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఎల్ నినో ప్రభావంతో రైతులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుంటే, పట్టిసీమ ద్వారా నీరందించి పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించాం. మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుపాను రైతులను కోలుకోలేని దెబ్బతీసింది” అని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై తుపాను ప్రభావం తీవ్రంగా ఉందని తెలిపారు.ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో నష్టాన్ని చాలా వరకు నివారించగలిగామని సీఎం స్పష్టం చేశారు. “తుపానులపై ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పుడు ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దు. ముందస్తు జాగ్రత్తల వల్లే ప్రాణనష్టాన్ని నివారించి, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగాం” అని విజ్ఞప్తి చేశారు. తుపాను సహాయక చర్యల కోసం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సాయం తీసుకుంటున్నామని వివరించారు. అర్నబ్ తుపాను వల్ల నేలకొరిగిన 30 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించామని, మురసు తుపాను వల్ల దెబ్బతిన్న మరో 10 వేల స్తంభాలను కూడా యుద్ధప్రాతిపదికన సరిచేస్తున్నామని తెలిపారు. ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు.తుపానుల వల్ల జరిగిన నష్టంపై పూర్తిస్థాయిలో అంచనాలు వేస్తున్నామని, దీనిపై ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి సమాచారం అందిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఫోన్ చేసి తుపానుల ప్రభావంపై ఆరా తీశారని వెల్లడించారు. నష్టపోయిన రైతులకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా పెట్టుబడిని తిరిగి అందిస్తామని హామీ ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చివరి వ్యక్తికి సాయం అందే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే పనిచేస్తారని స్పష్టం చేశారు. నల్లమడ డ్రెయిన్‌కు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

వ్యవసాయ వ్యర్థాలే సేంద్రియ ఎరువులు.. రైతులకు విద్యార్థుల ప్రత్యక్ష అవగాహన

గరిడేపల్లి, నవంబర్ 6, (ప్రజానేస్తం జ్వాల):

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలో వ్యవసాయ వ్యర్థాలను సద్వినియోగం చేసుకుంటూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవాలని బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు రైతులకు సూచించారు.గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా ఏలూరులోని సీహెచ్ఎస్డీ సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ చివరి సంవత్సరం విద్యార్థులు, గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం మార్గదర్శకత్వంలో కీతవారిగూడెం గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ వ్యర్థాలు, ఎండిన ఆకులు, ఇతర సేంద్రియ పదార్థాలను శాస్త్రీయ పద్ధతిలో కుళ్ళింపజేసి నాణ్యమైన సేంద్రియ ఎరువుగా తయారు చేసుకునే విధానాన్ని ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరగడంతో పాటు నేలలో సేంద్రియ పదార్థం వృద్ధి చెంది, పంటల ఆరోగ్యకరమైన పెరుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు సాగు ఖర్చులను నియంత్రించుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో రైతులు గుండు సతీష్, వెల్పుల రామలింగయ్య, నర్సింగ్ నరేష్, ఎస్.కె. పెరుసాహెబ్, కట్రేపుల వెంకటేష్, ముంతా నాగయ్య, యల్లావుల రాములు, కట్రేపుల నర్సయ్య, సనగాని వెంకటేష్, బడేటి వినయ్, దాసరి సైదులు, పిల్లి యాదగిరి, బొల్లెపల్లి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని అగ్రికల్చర్ విద్యార్థులు ఎం. నవ్యశ్రీ, వి. మనీషా, పి. హేమలత, ఐ. సత్యశ్రీ, వి. సౌమ్య, ఆర్. మోనిక నిర్వహించారు.



ఈవీఎం గోదాంలో భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్ హరిత క్షేత్రస్థాయి తనిఖీ

ఆసిఫాబాద్, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల):

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ గోదాం వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిత తెలిపారు. ఈవీఎంల భద్రత విషయంలో నిరంతర పర్యవేక్షణ అవసరమని, నిబంధనల ప్రకారం అన్ని భద్రతా చర్యలు అమలులో ఉండాలని పేర్కొన్నారు.శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదామును నెలవారీ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ హరిత సందర్శించారు. ఈ సందర్భంగా గోదాం ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన సీలింగ్ వ్యవస్థను పరిశీలించారు. గోదాం పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, నిఘా వ్యవస్థను తనిఖీ చేశారు. భద్రతా ఏర్పాట్ల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత వివరాలను తెలుసుకున్నారు.ఈవీఎం గోదాం వద్ద భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని సూచించారు. గోదాం ప్రవేశ ద్వారాల సీలింగ్, భద్రతా పర్యవేక్షణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత కీలకమైన అంశమని, వాటి పరిరక్షణకు సంబంధిత అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈవీఎం గోదాముకు సంబంధించిన భద్రతా చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్దేశిత మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలని ఆమె స్పష్టం చేశారు.



రోడ్లపై ధాన్యం కుప్పలు.. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం!

ఏటా ప్రమాదాలు జరుగుతున్నా మారని పరిస్థితి.. రైతులకు ప్రత్యామ్నాయ కల్లాలు ఎక్కడ?

ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలి.. ప్రజల డిమాండ్

నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల) ప్రత్యేక కథనం:

వరి కోతల సీజన్ ప్రారంభమైంది. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు సరైన స్థలాలు లేక రహదారులనే కల్లాలుగా మార్చుకుంటున్నారు. గ్రామీణ రహదారుల నుంచి ప్రధాన రహదారుల వరకు ధాన్యం కుప్పలు దర్శనమిస్తుండటంతో వాహనదారుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ధాన్యం కుప్పలు, రోడ్లపై ఆక్రమణలు ప్రమాదాలకు కారణమయ్యే ప్రమాదం ఉంది. ఏటా ఇదే సమస్య పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్లపై ధాన్యం.. ప్రమాదాలకు ఆహ్వానం!

కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లో సరిపడా స్థలం, నిల్వ సదుపాయాలు లేకపోవడంతో రైతులు రోడ్ల పక్కన, కొన్ని ప్రాంతాల్లో రహదారులపైనే ధాన్యం ఆరబెడుతున్నారు. అంతేకాకుండా ముందుగానే సంచులు, బండరాళ్లతో రోడ్డు పక్కన స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా ఎదురుగా వచ్చే వాహనాలను గమనించడం కష్టమవుతోంది. ద్విచక్ర వాహనదారులు, రాత్రివేళ ప్రయాణించే వారు ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది.

గత ప్రమాదాల నుంచి గుణపాఠం లేదా?

గతంలో రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం, కుప్పలు పోయడం కారణంగా జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఒకరి నిర్లక్ష్యం మరో కుటుంబానికి తీరని విషాదాన్ని మిగిల్చే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రైతులకు సౌకర్యాలేవి?

రోడ్లపై ధాన్యం పోయవద్దని రైతులకు సూచించడం మాత్రమే సమస్యకు పరిష్కారం కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ధాన్యం ఆరబెట్టేందుకు ప్రత్యామ్నాయ స్థలాలు, కొనుగోలు కేంద్రాల్లో అదనపు సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. వర్షాలకు పంట తడిసిపోకుండా, కొనుగోళు ఆలస్యమై నాణ్యత దెబ్బతినకుండా రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. రైతుల ప్రయోజనాలను కాపాడుతూనే ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలి.

ఇప్పటికైనా అధికారులు మేల్కొనాలి!

ప్రతి గ్రామంలో ధాన్యం ఆరబెట్టేందుకు ప్రభుత్వ స్థలాలను గుర్తించి కల్లాలు ఏర్పాటు చేయాలి.

కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లో అదనపు స్థలం, నిల్వ సదుపాయాలు కల్పించాలి.

ప్రధాన రహదారులపై ధాన్యం ఆరబెట్టకుండా పర్యవేక్షణ పెంచాలి.

పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో ప్రమాదకర ప్రాంతాలను గుర్తించాలి.

రైతులకు ముందస్తు అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సహకరించాలి.

గతంలో ప్రమాదాలు జరిగిన ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలి.

మరో ప్రాణం పోయాక స్పందిస్తారా?

ప్రతి ఏడాది వరి కోతల సమయంలో ఎదురవుతున్న ఈ సమస్యకు ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్‌తోపాటు సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులకు ధాన్యం ఆరబెట్టుకునే సదుపాయాలు కల్పించడం, రహదారులపై ప్రమాదాలను నివారించడం రెండింటినీ సమన్వయంతో అమలు చేయాల్సిన అవసరం ఉంది.రైతు పండించిన ధాన్యం రోడ్డుపై ఆరబెట్టాల్సిన దుస్థితి మారాలి.. రహదారిపై ప్రయాణించే ప్రజల ప్రాణాలకు భరోసా కలగాలి. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే పరిస్థితికి స్వస్తి పలికి, ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇంకెన్ని ప్రాణాలు బలైతే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది?

వరంగల్‌లో కల్తీ కారం, పసుపు పొడి గుట్టురట్టు.. 2,250 కిలోలు స్వాధీనం!

వరంగల్, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ నగరంలో కల్తీ ఆహార పదార్థాల తయారీ గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు రట్టు చేశారు. మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో సంయుక్తంగా దాడులు నిర్వహించి భారీగా కల్తీ కారం, పసుపు పొడిని స్వాధీనం చేసుకున్నారు.ఈ దాడుల్లో కరీమాబాద్‌కు చెందిన ఆకుతోట గోపిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 2,250 కిలోల కల్తీ కారం, పసుపు పొడిని పట్టుకోగా, వాటి విలువ సుమారు రూ. 5.92 లక్షలుగా అధికారులు అంచనా వేశారు.ఎలాంటి లైసెన్స్, లేబుల్స్ లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో పొడులను ప్యాకింగ్ చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాలపై అధికారులు చర్యలు చేపట్టారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలి: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

తొర్రూర్, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల):



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ పేరును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. రోజువారీ పనులు, ఉద్యోగ, వ్యాపార వ్యవహారాల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ కొంత సమయం కేటాయించి ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని సూచించారు.ఓటు హక్కు ప్రతి పట్టభద్రుడికి ఉన్న ప్రజాస్వామ్య హక్కు అని, దాన్ని వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరుగా నమోదు కావాలని పేర్కొన్నారు. చివరి తేదీ వరకు వేచి చూడకుండా అవసరమైన ధ్రువపత్రాలతో వీలైనంత త్వరగా నమోదు చేసుకోవాలని కోరారు.కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, తోటి పట్టభద్రులకు కూడా ఓటు నమోదు ప్రాధాన్యతను వివరించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. అర్హత ఉన్న ఒక్క పట్టభద్రుడు కూడా ఓటరు నమోదుకు దూరం కాకూడదన్నారు. మరింత మంది పట్టభద్రులకు అవకాశం కల్పించేలా ఓటరు నమోదు గడువును పొడిగించాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

బీజేపీ సీనియర్ నాయకుడు మాతంగి బేబీ సతీమణి కలమ్మ మృతి

గరిడేపల్లి, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల):



సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు మాతంగి బేబీ సతీమణి కలమ్మ అనారోగ్యంతో/ (కారణం తెలియదు) కన్నుమూశారు. ఆమె మృతి పట్ల మండల, జిల్లా స్థాయి బీజేపీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు.ఈ సందర్భంగా కలమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గరిడేపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు గౌడ్, మండల ఉపాధ్యక్షుడు నర్సింగ్ నాగ సైదులు, జిల్లా నాయకుడు నర్సింగ్ అంజయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పిడమర్తి అశోక్ కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపాటి రాజుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చరిత్ర పుటల్లో కాగజ్‌నగర్ సర్ సిల్క్ కంపెనీ

కాగజ్‌నగర్, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల):



ఒకప్పుడు వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించి జీవనాధారంగా నిలిచిన కాగజ్‌నగర్ సర్ సిల్క్ కంపెనీ నేడు చరిత్ర పుటలకే పరిమితమైంది. 1939లో నిజాం పాలనలో ప్రారంభమైన ఈ పరిశ్రమ 1984లో మూతపడింది. అనంతరం 1991లో తిరిగి ప్రారంభమైనప్పటికీ కేవలం 11 నెలలకే మళ్లీ మూతపడింది.ఈ పరిశ్రమ మూతపడటంతో ఎంతోమంది కార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికీ పలువురు మాజీ కార్మికులకు రావాల్సిన బకాయిలు అందలేదని మాజీ కార్మికులు మహమ్మద్ అఫ్టల్, మహమ్మద్ మస్కీన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమకు రావాల్సిన బకాయిలు చెల్లించి న్యాయం చేయాలని వారు కోరారు.

త్వరలో ప్రారంభం కానున్న రామస్వామిగుట్ట ఇందిరమ్మ మోడల్ హౌసింగ్ కాలనీ

సూర్యాపేట, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల):



హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామిగుట్ట వద్ద 110 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇళ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.శుక్రవారం మంత్రి కాలనీని సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం, వీధి దీపాలు, గ్రీనరీ, తాగునీటి వసతి, పైలాన్ స్తూపం, సభాస్థలి తదితర అభివృద్ధి పనులను సమీక్షించారు. మిగిలిన పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీలో నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించి అవి ఎండిపోకుండా సంరక్షించాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన పేదలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ రఘువీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కే. నరసింహ, ఆర్డీవో శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ జబ్బార్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అంగన్వాడీ ఉద్యోగాలకు భారీ పోటీ.. 23 పోస్టులకు 630 దరఖాస్తులు!

భీమదేవరపల్లి, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లాలో అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి భారీ పోటీ నెలకొంది. కేవలం 23 పోస్టుల కోసం ఏకంగా 630 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఒక్కో పోస్టుకు సగటున 27 మందికి పైగా పోటీ పడుతున్నారు.భీమదేవరపల్లి ప్రాజెక్టు పరిధిలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, హసన్పర్తి మండలాల్లో ఖాళీగా ఉన్న 23 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం 630 దరఖాస్తులు అందగా, గత నెలలో నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు 435 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మరో 195 మంది గైర్హాజరయ్యారు.ఈ వివరాలను భీమదేవరపల్లి ప్రాజెక్టు సీడీపీఓ స్వరూప వెల్లడించారు. దీపావళి అనంతరం సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులకు ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం తదుపరి ప్రక్రియ పూర్తి చేసి ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. 23 పోస్టులు.. 630 మంది అభ్యర్థులు.. తుది ఎంపికలో ఉద్యోగాలు ఎవరిని వరిస్తాయోనన్న ఆసక్తి నెలకొంది.

బాణసంచా దుకాణాల వద్ద భద్రతా లోపాలకు తావివ్వొద్దు!

హుజూర్‌నగర్, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల):



దీపావళి పండుగ నేపథ్యంలో హుజూర్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేస్తున్న బాణసంచా దుకాణాల వద్ద భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్ అధికారులను కోరారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ముప్పు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ సతీష్, ఫైర్ ఆఫీసర్ సుబ్బరామిరెడ్డి, తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ యాదగిరికి వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాణసంచా దుకాణాలకు సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరి చేయాలని, జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాలు, నివాసాల మధ్య ఏర్పాటు చేసిన దుకాణాలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. ప్రతి దుకాణంలో అగ్నిమాపక పరికరాలు, ఇసుక, నీటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు తనిఖీలు చేపట్టాలన్నారు.అలాగే నాణ్యతలేని, గడువు ముగిసిన బాణసంచా విక్రయాలను అరికట్టడంతో పాటు నిర్ణీత ధరలకు మించి విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించే దుకాణాలపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో ఆనందాన్ని నింపాలే తప్ప, అధికారుల నిర్లక్ష్యం లేదా వ్యాపారుల నిబంధనల ఉల్లంఘన వల్ల ప్రమాదాలకు కారణం కాకూడదని హరీష్ గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు బెల్లంకొండ నరేష్ గౌడ్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి కంటు నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి గుండా గోపి, ఉపాధ్యక్షుడు పైడిమర్రి విజయ్, కొప్పెర సాయిరాం, చిలక రాజు సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాలతో విద్యకు ప్రాణం.. ఇంజనీరింగ్ ల్యాబ్‌లను సందర్శించిన పాఠశాల విద్యార్థులు

భీమదేవరపల్లి, నవంబర్ 6, (ప్రజానేస్తం జ్వాల):



పుస్తకాల్లో చదివిన విద్యను ప్రయోగాల ద్వారా ప్రత్యక్షంగా పరిశీలించినప్పుడే విద్యార్థులకు అంశాలపై సంపూర్ణ అవగాహన కలుగుతుందని కమల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శంకర్ అన్నారు.సింగాపురంలోని కమల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో గట్ల నర్సింగాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థుల కళాశాల ప్రయోగశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శంకర్ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో నేర్చుకున్న శాస్త్రీయ అంశాలను ఉన్నత విద్యలో ప్రయోగాల ద్వారా మరింత లోతుగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇలాంటి సందర్శనలు విద్యార్థుల్లో నూతన విషయాలపై ఆసక్తిని, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులు మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాల ప్రయోగశాలలను సందర్శించి వివిధ యంత్రాల పనితీరును పరిశీలించారు. ఆయా విభాగాల అధిపతులు డాక్టర్ ఎం.వి. సతీష్ కుమార్, డాక్టర్ బి. రమేష్, డాక్టర్ యోగేష్ ఫండలిక్‌తో పాటు అధ్యాపకులు విద్యార్థులకు యంత్రాల పనితీరు, సాంకేతిక అంశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు డి. రమేష్, ఉపాధ్యాయులు కె. శ్రీనివాస్, ఎం. నవీన్ కుమార్, ఎస్. స్రవంతి, బి. ఉమ, ఒకేషనల్ ఉపాధ్యాయులు పి. మౌనిక, కె. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూర్‌లో నేడే సదర్ మహోత్సవం


ముఖ్య అతిథిగా హాజరుకానున్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, నవంబర్ 6, (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో తొలిసారిగా సదర్ మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు భీమదేవరపల్లి శ్రీకృష్ణ యాదవ నాయకులు జక్కుల అనిల్ యాదవ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవుల సంప్రదాయాలు, ఆచారాలకు ప్రతీకగా నిలిచే సదర్ మహోత్సవాన్ని ముల్కనూర్‌లో నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు.సదర్ మహోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, యాదవ సంఘాల నాయకులు, కుల పెద్దలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జక్కుల అనిల్ యాదవ్ పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పథకాల లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలి





సూర్యాపేట, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల):

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించేలా జిల్లాల పనితీరును మరింత మెరుగుపరచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు. విద్య, ఉపాధి హామీ, తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, అభివృద్ధి లక్ష్యాల పురోగతిపై సమీక్షించారు. సూర్యాపేట జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ బి. హరి సింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధుల వినియోగాన్ని జనవరి మొదటి వారంలోగా గరిష్ట స్థాయికి, పీఖైనంత వరకు 100 శాతానికి చేర్చాలని సీఎస్ సూచించారు. నిధుల సద్వినియోగం ద్వారా కేంద్రం నుంచి అదనపు నిధులు పొందే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, మరమ్మతు పనులు చేపట్టాలని, అధికారులు తరచూ పాఠశాలలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాల నాణ్యతతో పాటు విద్యార్థుల హాజరు శాతం పెంపుపై దృష్టి సారించాలన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక నిఘా

వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎస్ స్పష్టం చేశారు. జిల్లా, మండల స్థాయిలో తాగునీటి కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి వారం పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. నవంబర్ 15లోగా చేతిపంపులు, బోర్లు, బహిరంగ బావులకు సంబంధించిన మరమ్మతులు పూర్తి చేయాలని, నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

12 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం

VBGRAMG పథకం ద్వారా మార్చి నెలాఖరు నాటికి 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ప్రస్తుతం రోజుకు సగటున 5.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు పేర్కొంటూ, చేపట్టే పనులు నాణ్యతతో ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు వేగం పెంచాలి

ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీల సమన్వయంతో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. పూర్తయిన ఇళ్లకు 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా కొత్త లోగోతో స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.లబ్ధిదారులకు సిమెంట్ బస్తాను రూ.230కే అందించేలా చర్యలు తీసుకోవాలని, సబ్సిడీ ద్వారా వారికి కలిగే ఆర్థిక ప్రయోజనం పూర్తిస్థాయిలో అందేలా చూడాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులోనూ జిల్లా పనితీరును మెరుగుపరచాలని, చేయూత పింఛన్ల పరిశీలన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ ప్రేమ్ రాజు, సీఈఓ శిరీష, డీఆర్డీఓ సన్యాసయ్య, డీపీఓ యాదగిరి, డీఐఈఓ సులోచన రాణి, డీఏవో శ్రీధర్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్ రెడ్డి, ఇంట్రా ఈఈ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పిల్లల అభిప్రాయాలకు పెద్దపీట.. చైల్డ్ ఫ్రెండ్లీ జిల్లాగా సూర్యాపేట!





సూర్యాపేట, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల):

పిల్లల అభిప్రాయాలు, అవసరాలు, సమస్యలను గుర్తించి వారికి సురక్షితమైన, అనుకూలమైన వాతావరణం కల్పించే లక్ష్యంతో సూర్యాపేట జిల్లాను చైల్డ్ ఫ్రెండ్లీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా యూనిసెఫ్ సహకారంతో నిర్వహించిన 'లిజనింగ్ టు చిల్డ్రన్' కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా సుమారు 6 వేల మంది విద్యార్థులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆధ్వర్యంలో మహిళా, శిశు సంక్షేమ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో జిల్లాలోని 100 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, గురుకుల, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు గ్రూప్ డిస్కషన్లలో చురుగ్గా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆలోచనలు, అభిరుచులు, భవిష్యత్తు లక్ష్యాలను పంచుకోవడంతో పాటు పాఠశాలలు, గ్రామాల్లో తమకు సురక్షితంగా అనిపించే ప్రాంతాలు, ఇబ్బందులు ఎదురయ్యే ప్రదేశాలను వివరించారు. పిల్లలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పాఠశాలలు, గ్రామాల్లో ఉండాల్సిన అనుకూల వాతావరణం, ఎదురవుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

పిల్లల సూచనల ఆధారంగా కార్యాచరణ

పిల్లల అభిప్రాయాలను గౌరవించి, వారి హక్కులను పరిరక్షించినప్పుడే చైల్డ్ ఫ్రెండ్లీ జిల్లాను నిర్మించడం సాధ్యమవుతుందని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. 'లిజనింగ్ టు చిల్డ్రన్' కార్యక్రమం ద్వారా సేకరించిన అభిప్రాయాలు, సూచనల ఆధారంగా పిల్లల అవసరాలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా శక్తి హబ్, సఖీ కేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సీఆర్‌పీలు, విద్యాశాఖ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్తకొండ వీరభద్రస్వామి జాతర టెండర్లతో రూ.30 లక్షలకు పైగా ఆదాయం

భీమదేవరపల్లి, నవంబర్ 6, (ప్రజానేస్తం జ్వాల):

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో 2027 జాతర నిర్వహణకు సంబంధించి చేపట్టిన టెండర్ కమ్ బహిరంగ వేలంలో పలు హక్కులను వ్యాపారులు పోటాపోటీగా దక్కించుకున్నారు. ఈ వేలం ప్రక్రియ ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ కిషన్ రావు తెలిపారు.దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో పరిశీలకురాలు నందనం కవిత పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. ఇందులో కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయ హక్కును కొత్తకొండకు చెందిన కొక్కర కొండ రాజు రూ.14,61,000కు దక్కించుకున్నారు. గుమ్మడికాయలు, కోరమీసాల విక్రయ హక్కును అదే గ్రామానికి చెందిన చెంగల కొమురయ్య రూ.10,47,000కు కైవసం చేసుకున్నారు.ఇతర హక్కుల వివరాలు ఇలా ఉన్నాయి. తలనీలాల సేకరణ హక్కును కొత్తకొండకు చెందిన కొలిపాక కొమురయ్య రూ.17,500కు, టెంట్ హౌస్ సామగ్రి సరఫరా హక్కును బుర్ర సమ్మయ్య రూ.1,35,000కు దక్కించుకున్నారు. పందిరిలో తడకలు వేసే పనిని హుస్నాబాద్‌కు చెందిన ములంగూరి చందు రూ.90,000కు, లైటింగ్, డెకరేషన్ పనులను కొత్తగట్టుకు చెందిన ఉమ్మెత్త నిరంజన్ రెడ్డి రూ.1,90,000కు కైవసం చేసుకున్నారు.మిగిలిన టెండర్ల నిర్వహణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రముఖులు, భక్తులు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



అమెరికాలో నల్గొండ యువతి అదృశ్యం.. బోస్టన్‌లో శ్రీజ కోసం గాలింపు

నల్గొండ, నవంబర్ 6, (ప్రజానేస్తం జ్వాల):



ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన నల్గొండ జిల్లాకు చెందిన శ్రీజ (23) బోస్టన్‌లో అదృశ్యమైనట్లు సమాచారం. ఏడాది క్రితం ఉన్నత విద్య అభ్యసించేందుకు అమెరికా వెళ్లిన ఆమె చదువుకుంటూనే పార్ట్‌టైం ఉద్యోగం చేస్తోంది.నవంబర్ 2వ తేదీ సాయంత్రం వాకింగ్‌కు వెళ్లిన శ్రీజ తిరిగి రాకపోవడంతో ఆమె స్నేహితులు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సమీపంలోని బీచ్ ప్రాంతంలో ఆమె సెల్‌ఫోన్ చివరి లొకేషన్ గుర్తించినట్లు సమాచారం. అయినప్పటికీ ఇప్పటివరకు శ్రీజ ఆచూకీ లభించలేదు.ఒక్కగానొక్క కుమార్తె అదృశ్యమవడంతో ఆమె తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. శ్రీజ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎదురుచూస్తున్నారు.

గట్టుప్పల్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బీఆర్ఎస్ అవగాహన

గట్టుప్పల్, నవంబర్ 6, (ప్రజానేస్తం జ్వాల):

మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు సూచించారు. పట్టభద్రుల ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య ప్రక్రియలో పట్టభద్రుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తమ ఓటు హక్కును పొందడంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తోటకూర శంకర్, పంకెర్ల ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ గొరిగె సత్తయ్య, చిలుకూరి అంజయ్య, ఐతరాజు హనుమంతు, పున్న కిశోర్, పిశికె రాంబాబు, నరేందర్, నర్ని జగన్, కర్నాటి వెంకటేశం, పున్న ఆనంద్, గంజి కృష్ణయ్య, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





సూర్యాపేట, నవంబర్ 6, (ప్రజానేస్తం జ్వాల):

జిల్లాలో విద్య, వైద్య మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేటలో రూ. 190 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ఐదు అంతస్తుల్లో 1,000 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ఆసుపత్రి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతం చేసి రెండు, మూడు నెలల్లో పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్‌బీఐ, ఐఓసీ, కోటక్ మహీంద్రా, అక్షర ఫౌండేషన్ సహకారంతో రూ. 1.17 కోట్ల అంచనా వ్యయంతో కొనుగోలు చేసిన ఆధునిక వైద్య పరికరాలను ప్రారంభించారు. వీటిలో వెంటిలేటర్లు, మైక్రోటోన్, కాటరీ మెషిన్, బ్రోంకోస్కోప్, డెంటల్ చైర్, సీ-ఆర్మ్ తదితర పరికరాలు ఉన్నాయి. అలాగే కాంపెన్సేటరీ అపాయింట్‌మెంట్ ప్రక్రియలో భాగంగా అర్హులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్--విజయవాడ నాలుగు వరుసల జాతీయ రహదారిని ఆరు వరుసల రహదారిగా విస్తరించేందుకు అనుమతులు తీసుకొచ్చి త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు ఆరో ప్యాకేజీ కింద తుంగతుర్తి నియోజకవర్గానికి రూ. 1,000 కోట్లు మంజూరు చేయించి సాగునీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. పాత లిఫ్టుల పునరుద్ధరణతో పాటు కొత్త లిఫ్టుల ఏర్పాటుకు కూడా ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ తెల్ల రేషన్ కార్డులు అందించామని, సుమారు 80 శాతం మంది ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో సూర్యాపేట జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ సభ్యులు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, మార్కెట్ కమిటీ చైర్మన్ వేనారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొర్రిశెట్టి నివేదిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రవణ్, మాజీ పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలు తప్పనిసరి

హనుమకొండ, నవంబర్ 06 (ప్రజానేస్తం జ్వాల):


పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనలను స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా పాటించాలని ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రజిత స్పష్టం చేశారు. చట్టం అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సంబంధిత కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య ఆదేశాల మేరకు హనుమకొండలోని పలు స్కానింగ్ కేంద్రాలను డాక్టర్ రజిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో నిర్వహిస్తున్న రికార్డులు, ఫారమ్-ఎఫ్, స్కానింగ్ యంత్రాలకు సంబంధించిన అనుమతి పత్రాలు, ఇతర రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. చట్ట ప్రకారం అవసరమైన రికార్డులను సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అనే అంశాలను తనిఖీ చేశారు. ప్రతి స్కానింగ్ కేంద్రం రోజువారీ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. రికార్డుల్లో ఎలాంటి తప్పులు, అసంపూర్ణ వివరాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. స్కానింగ్ సేవలు అందించే సమయంలో ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. భ్రూణ లింగ నిర్ధారణను నిరోధించడం, ఆడపిల్లల సంరక్షణకు చట్టపరమైన రక్షణ కల్పించడం పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ చట్టానికి విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండటంతో పాటు, తనిఖీల సమయంలో అవసరమైన రికార్డులు, అనుమతి పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని డాక్టర్ రజిత సూచించారు.



వైద్యానికి భరోసా.. ఆడపిల్లల పెళ్లికి ఆర్థిక సాయం

పరకాల, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల):

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబాలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ పరిధిలోని పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, సంగెం, గీసుకొండ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 53 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 53,06,148 విలువైన చెక్కులను అందజేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద 221 మంది లబ్ధిదారులకు రూ. 77,35,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల భారం తగ్గించడంతో పాటు, ఆడపిల్లల వివాహాలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆర్థికంగా తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు.



పేదింటి ఆడబిడ్డల పెళ్లికి ఆర్థిక భరోసా..

గోరుకొత్తపల్లి, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల):

పేద కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం గోరుకొత్తపల్లి మండలంలో నిర్వహించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన 21 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహం ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందన్నారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ వేలం నుంచి ముస్తఫాపూర్ పార్కింగ్‌కు మినహాయింపు ఇవ్వాలి

భీమదేవరపల్లి, నవంబర్ 6, (ప్రజానేస్తం జ్వాల):



కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ వేలం పాటల నుంచి ముస్తఫాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పార్కింగ్ స్థలాన్ని మినహాయించాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం దేవస్థానం కార్యనిర్వహణాధికారికి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ తాళ్ల అరవింద్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు మాట్లాడుతూ.. శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్ కారణంగా ముస్తఫాపూర్ గ్రామం తీవ్ర ప్రభావానికి గురవుతోందని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల్లో అధిక సంఖ్యలో తమ గ్రామ పంచాయతీ పరిధి నుంచే రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. అయితే బ్రహ్మోత్సవాల సందర్భంగా పార్కింగ్ ద్వారా దేవస్థానం నుంచి ముస్తఫాపూర్ గ్రామ పంచాయతీకి ఎలాంటి ఆదాయం లేదా రుసుము చెల్లించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ పరిధిలోని పార్కింగ్ స్థలాన్ని ఆలయ వేలం పాటల నుంచి మినహాయించి, పార్కింగ్ నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీకి అప్పగించాలని కోరారు. ఈ ఏడాది నుంచి గ్రామ పరిధిలో పార్కింగ్, ఇతర నిర్వహణ కార్యక్రమాలను పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించి, తద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామ అభివృద్ధికి వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా పార్కింగ్ స్థలానికి వేలం నిర్వహిస్తే, గ్రామ పంచాయతీ పరిధిలో పార్కింగ్ ఏర్పాటుకు, రుసుముల వసూలుకు అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాళ్ల అరవింద్ గౌడ్, కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు, సీనియర్ జర్నలిస్ట్ కొండ్రోజు ప్రవీణ్ కుమార్, తాళ్ల రమేష్, రొంటాల ప్రభాకర్, ఎం. కంచరి ప్రవీణ్, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు బండి సంజయ్ ఆర్థిక భరోసా

భీమదేవరపల్లి, నవంబర్ 06 (ప్రజానేస్తం జ్వాల):



ఆర్థిక ఇబ్బందులతో పేద విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పించారు. హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 463 మంది విద్యార్థుల పరీక్ష ఫీజుల కోసం మొత్తం రూ. 57,875ను స్వయంగా చెల్లించారు. ఈ వివరాలను బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కోలను సంతోష్ రెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ రవికి అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో బండి సంజయ్ అందించిన సహకారంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి సర్పంచ్, సిద్ధిపేట జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు మాచర్ల కుమారస్వామి, భీమదేవరపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రుత్విక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

హనుమకొండ, నవంబర్ 06 (ప్రజానేస్తం జ్వాల):




స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహణ సాగిస్తూ, పిల్లల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అనిల్ చందర్, డాక్టర్ అనితా రెడ్డి సూచించారు. హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి చిన్నారికి సంబంధించిన వ్యక్తిగత వివరాలు, వైద్య చరిత్రకు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అలాగే సంస్థకు సంబంధించిన లైసెన్సులను గడువులోగా రెన్యూవల్ చేయించుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆశ్రమంలో పిల్లలకు అందిస్తున్న సేవలు, వసతులు, సౌకర్యాలను వారు పరిశీలించారు.

డిసెంబర్ నుంచి మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పనులు ప్రారంభం: సీఎం రేవంత్ రెడ్డి

హనుమకొండ, నవంబర్ 06 (ప్రజానేస్తం జ్వాల):

మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతు, పునరుద్ధరణ పనులను డిసెంబర్ నెల నుంచి ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న బ్యారేజీల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం రూ. 4,193 కోట్లను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. బ్యారేజీలకు జరిగిన నష్టానికి నిర్మాణపరమైన లోపాలే ప్రధాన కారణమని సీఎం పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో చోటుచేసుకున్న లోపాలపై ఇప్పటికే పలు అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. ప్రజాధనం వృథా కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు భద్రత విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీపడబోదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బ్యారేజీల పునరుద్ధరణలో నాణ్యతా ప్రమాణాలు, సాంకేతిక నిపుణుల సూచనలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) సూచనలు, మార్గదర్శకాలకు అనుగుణంగానే పనులు చేపడతామని పేర్కొన్నారు. బ్యారేజీల పటిష్టత, భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటూ పునరుద్ధరణ పనులను ముందుకు తీసుకెళ్తామని సీఎం వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టును తిరిగి సమర్థవంతంగా వినియోగంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

బాలికపై లైంగిక దాడి కేసులో దోషి పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

హనుమకొండ, నవంబర్ 06 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ జిల్లాలో గిరిజన బాలికపై సామూహిక లైంగిక దాడికి సంబంధించిన కేసులో ట్రయల్ కోర్టు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను సుప్రీంకోర్టు సమర్థించింది. శిక్షను సవాలు చేస్తూ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. వివరాల ప్రకారం.. 2015 మార్చి 16న వరంగల్ జిల్లాలోని ఓ తండాలో ఒంటరిగా ఉన్న గిరిజన బాలికపై పలువురు సామూహిక లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదైంది. ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అనంతరం ఈ తీర్పును సవాలు చేస్తూ నిందితుడు హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా ట్రయల్ కోర్టు విధించిన శిక్ష సమర్థించబడింది. దీంతో నిందితుడు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లి సభ్యులుగా ఉన్న ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన అనంతరం నిందితుడి పిటిషన్‌ను తిరస్కరిస్తూ, కింది కోర్టులు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను ఖరారు చేసింది. దీంతో ఈ కేసులో నిందితుడికి విధించిన శిక్షపై న్యాయపరమైన సవాలు ముగిసింది.

పోక్సో కేసులో నిందితుడికి 50 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

హనుమకొండ, నవంబర్ 06 (ప్రజానేస్తం జ్వాల):



మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి వరంగల్ ప్రత్యేక సెషన్స్ కోర్టు 50 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. నెక్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో న్యాయస్థానం ఈ తీర్పు వెలువరించింది. వివరాల ప్రకారం.. సంతగల్లు నాయుడు అలియాస్ సిద్ధార్థ్ (21) అనే యువకుడిపై 2023లో నెక్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదైంది. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేసి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ సందర్భంగా సమర్పించిన ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన వరంగల్ ప్రత్యేక సెషన్స్ జడ్జి నిందితుడిపై నేరం రుజువైనట్లు నిర్ధారించారు. దీంతో నిందితుడికి 50 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పు ప్రకటించారు. మైనర్ బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.

రేషన్ బియ్యం అక్రమ రవాణా ఆరోపణలపై డీఎంపై సీఐడీ విచారణకు ఆదేశం

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 06 (ప్రజానేస్తం జ్వాల):



యశంకర్ భూపాలపల్లి జిల్లాలో రేషన్ బియ్యం అక్రమంగా పక్కదారి పట్టినట్లు వచ్చిన ఆరోపణలపై సంబంధిత జిల్లా మేనేజర్ (డీఎం) వ్యవహారంపై సీఐడీ విచారణకు పౌరసరఫరాల శాఖ ఆదేశించినట్లు సమాచారం. గత ఏడేళ్లుగా భారీ స్థాయిలో బియ్యం నిల్వలు, లావాదేవీల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో బియ్యం నిల్వలు, సరఫరాలు, లావాదేవీలకు సంబంధించిన వివరాలను పరిశీలించేందుకు పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు కూడా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా వెలువడుతున్న కథనాలు, అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం విచారణకు అనుమతి ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు, ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు జిల్లా మేనేజర్ గత కొన్ని రోజులుగా కార్యాలయానికి హాజరుకావడం లేదని సమాచారం. అయితే సీఐడీ విచారణకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు, ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ ఇంకా స్పష్టంగా వెలువడాల్సి ఉంది. విచారణ పూర్తయితే గత ఏడేళ్లలో జరిగిన బియ్యం నిల్వలు, సరఫరాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ముల్కనూర్ మోడల్ స్కూల్‌లో మూడు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు

- **లైబ్రేరియన్, కంప్యూటర్, యోగా టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం**

భీమదేవరపల్లి, నవంబర్ 6, (ప్రజానేస్తం జ్వాల):

హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా చైర్మన్ ఆధ్వర్యంలోని కాకతీయ ఉద్యోగ వికాస సంస్థ ద్వారా తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో భాగంగా ముల్కనూర్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో మూడు పోస్టులను భర్తీ చేయనున్నారు. వివరాల ప్రకారం.. లైబ్రేరియన్ ఒక పోస్టు, కంప్యూటర్ టీచర్ ఒక పోస్టు, యోగా టీచర్ ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయి. అర్హత కలిగిన అభ్యర్థులకు లైబ్రేరియన్ పోస్టుకు నెలకు రూ.19,500, కంప్యూటర్, యోగా టీచర్ పోస్టులకు నెలకు రూ.22,750 చొప్పున వేతనం చెల్లించనున్నారు. అభ్యర్థుల వయస్సు 21 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. ఈ నెల 7వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై, 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. దరఖాస్తుల పరిశీలన అనంతరం మెరిట్, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.



రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం.. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఘనపురం, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల):

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా, ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కోతలు విధించకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని ఘనపురం మండలం గొల్లపల్లి గ్రామంలో చెల్పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధాన్యం తూకం, లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, కొనుగోళ్లలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు మద్దతుగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రైతులు ధాన్యం విక్రయించే సమయంలో నిబంధనల



ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెల్పూర్ పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ కార్యవర్గ సభ్యులు, సంబంధిత అధికారులు, చెల్పూర్ మరియు ఘనపురం మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కొంపల్లి ప్రభుత్వ పాఠశాలలో టాలెంట్ టెస్ట్.. టాప్-10 విద్యార్థులకు బహుమతులు

కొంపల్లి, నవంబర్ 06 (ప్రజానేస్తం జ్వాల):



కొంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎజుశ్రా యా చీజుజుణ్ +=ాఖ్రూ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, చదువుపై ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పరీక్షను నిర్వహించారు. పరీక్షలో 60 శాతానికి పైగా మార్కులు సాధించి టాప్-10 స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ాాూా ×చీ ాచీజు పుస్తకాలను బహుమతులుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత పిన్నింటి మాధవరావు (JPA, KTPP) పుస్తకాలను అందించడంతో పాటు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థి ఉన్నత విద్యకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొంగ సోమేశ్వర్ (AE, KTPP), కొంపల్లి గ్రామ సర్పంచ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులు విద్యార్థులకు విలువైన సూచనలు చేస్తూ, క్రమశిక్షణతో చదివి ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, పేద విద్యార్థులకు అండగా నిలవడం ద్వారా వారు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునేలా చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఎజుశ్రా TO NEEDY GROUP ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమ విజయానికి సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, ముఖ్య అతిథులు, ప్రశ్నాపత్రాల రూపకల్పనలో, పరీక్ష నిర్వహణలో భాగస్వాములైన వారితో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ HELP TO NEEDY GROUP తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఆరేపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం.. యువకుడు దుర్మరణం!

వరంగల్, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆరేపల్లి ప్రాంతంలోని అయ్యప్ప టెంపుల్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న 18 ఏళ్ల యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం మృతుడు మహబూబాబాద్‌కు చెందిన యువకుడిగా గుర్తించారు. ప్రమాదం ఏ విధంగా జరిగిందనే వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న ఏనుమాముల పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. మృతదేహాన్ని తదుపరి చర్యల నిమిత్తం తరలించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులో హుజూర్నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి



హుజూర్నగర్, నవంబర్ 6 (ప్రజానేస్తం జ్వాల) :

తెలంగాణ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టు 2026--27లో హుజూర్నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ సోమపంగు రామారావు మాట్లాడుతూ, రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన కామర్స్ విభాగాధిపతి బి. నాగార్జున సాగర్‌ను, బహుమతి విజేతలైన ఆహ్లాద, లక్ష్మి, స్పందన, పావని, సమీరాలను అభినందించారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ ఒత్తిడితో కథ మార్చారా? 'మాతృభూమి'పై సల్మాన్ ఖాన్ క్లారిటీ

తన తాజా చిత్రం 'మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్' కథను ప్రభుత్వ ఒత్తిడితో మార్చారన్న ప్రచారాన్ని బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఖండించారు. సెన్సార్ బోర్డు అభ్యంతరాల వల్ల సినిమా నిలిచిపోయిందన్న వార్తల్లోనూ నిజం లేదని స్పష్టం చేశారు. శుక్రవారం ముంబైలో నిర్వహించిన సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన ఈ విషయాలపై స్పందించారు. ప్రభుత్వం చెప్పడంతో కథను తిరిగి రాశారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని సల్మాన్ అన్నారు. "ఇదంతా అబద్ధం. మా సినిమా సైనికులు, వారి కుటుంబాలు ఎదుర్కొనే పరిస్థితుల చుట్టూ తిరుగుతుంది. ఇరు దేశాల వైపు ఉన్న సైనికుల జీవితాలను ఇందులో చూపించాం. ఇందులో ఎవరి పట్ల ప్రతికూలత లేదు. పరిస్థితులే ప్రతికూలంగా ఉంటాయి" అని వివరించారు. దర్శకుడు అపూర్వ లఖియా తొలుత మరో కథాంశంతో సినిమా రూపొందించారని సల్మాన్ వెల్లడించారు. ఈ చిత్రం మొదట 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' పేరుతో తెరకెక్కింది. 2020 జూన్‌లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణ ఈ కథకు ప్రేరణగా నిలిచింది. అయితే ప్రస్తుత రూపంలో సైనికుల అనుభవాలు, వారి కుటుంబాల భావోద్వేగాలపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు సల్మాన్ తెలిపారు. సైనికులకు దేశమే మొదటి ప్రాధాన్యమని, వ్యక్తిగతంగా ఒకరిపై ఒకరికి సానుకూల భావాలు ఉన్నా పరిస్థితులు ఎదురైనప్పుడు దేశం కోసమే నిలబడతారని చెప్పారు. ఇరు వైపులా సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం జరుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ సినిమా ఏప్రిల్‌లో విడుదల కావాల్సి ఉండగా, వాయిదా పడింది. తాజా ప్రకటన ప్రకారం డిసెంబరు 4న థియేటర్లలోకి రానుంది. సల్మాన్ ఖాన్ స్వయంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో చిత్రాంగద సింగ్, ముఖేశ్ రిషి, అంకుర్ భాటియా, జేన్ షా, అభిలాష్ చౌదరి తదితరులు నటిస్తున్నారు.



'రామాయణ'పై రకుల్ ప్రీత్ సింగ్ భావోద్వేగం

శూర్పణఖ పాత్ర తనకో ప్రత్యేక ప్రయాణమన్న రకుల్ ప్రీత్ సింగ్

భారతీయురాలిగా గర్వపడే క్షణమని వ్యాఖ్య

'రామాయణ' టీమ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన రకుల్

బాలీవుడ్ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన 'రామాయణ' చిత్రం నవంబర్ 6న విడుదలై మంచి ప్రేక్షకాదరణ పొందుతోంది. ఈ సినిమాలో కీలకమైన శూర్పణఖ పాత్రను నటి రకుల్ ప్రీత్ సింగ్ పోషించారు. తాజాగా ఈ పాత్రలో నటించడంపై తన అనుభవాలను, సంతోషాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "శూర్పణఖ పాత్ర పోషించడం నా జీవితంలో ఒక ప్రత్యేకమైన ప్రయాణం. భారతీయ సంస్కృతిలో భాగమైన రామాయణాన్ని ఇంత భారీ స్థాయిలో వెండితెరపై ఆవిష్కరించడం అద్భుతమైన అనుభూతినిచ్చింది" అని రకుల్ పేర్కొన్నారు. ఈ గొప్ప ఆలోచనను కార్యరూపంలో పెట్టిన దర్శకుడు నితీశ్ తివారీ, నిర్మాత నమిత్ మల్హోత్రాకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచానికి భారత్ నుంచి ఓ అద్భుతమైన చిత్రాన్ని అందించాలన్న వారి తపన తనకు స్ఫూర్తినిచ్చిందని వివరించారు. ఈ సినిమాలో తన సహనటులైన రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, రవిదూబే, కాజల్ అగర్వాల్‌తో పాటు చిత్ర యూనిట్ మొత్తానికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా, రోజూ నాలుగు గంటల పాటు శ్రమించి తనను శూర్పణఖగా సిద్ధం చేసిన కాస్ట్యూమ్ బృందాల కృషిని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, ఒక భారతీయురాలిగా తాను ఎంతో గర్వపడే క్షణం అని రకుల్ తన పోస్టులో ఉద్వేగంగా రాసుకొచ్చారు.

